క్లుప్తంగా

మాజీ రాష్ట్రపతి నీలం సంజీవ రెడ్డికి నివాళి


నీలం సంజీవరెడ్డి విగ్రహానికి పూలమాల వేస్తున్న అధికారులు

తిరుపతి సిటీ: భారత మాజీ రాష్ట్రపతి, విశ్వవిద్యాలయ స్థాపనలో కీలక పాత్ర పోషించిన నీలం సంజీవ రెడ్డి సేవలు మరువలేమని పలువురు కొనియాడారు. సోమవారం ఎస్వీయూలో 112వ జయంతి సందర్భంగా వీసీ, రిజిస్ట్రార్, ఉద్యోగులు పరిపాలనా భవనం ఎదుట ఉన్న నీలం సంజీవరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఆయన దార్శనిక నాయకత్వం విశ్వవిద్యాలయానికి పునాది వేయడమే కాకుండా భవిష్యత్ తరాలకు విద్యాపథకాన్ని కూడా రూపొందించారని, ఆయనకు రుణపడి ఉన్నామని తెలిపారు. రిజిస్ట్రార్ భూపతి నాయుడు, ఇంజినీర్ ఇన్‌చార్జ్ తాండవ కృష్ణ, అధికారులు, అధ్యాపకులు, ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో పాడి ఆవు మృతి

తిరుపతి రూరల్ : తిరుపతి రూరల్ మండలం గాంధీపురం పంచాయతీ పరిధిలో ఉన్న రాజీవ్ గృహకల్ప అపార్ట్‌మెంట్‌ల వద్ద ట్రాన్స్‌ఫార్మర్ సమీపంలో పచ్చిక మేస్తూ వెళ్లిన ఓ ఆవు విద్యుత్ షాక్‌కు గురై ప్రాణాలు విడిచింది. సోమవారం సాయంత్రం కురిసిన వర్షాలకు ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఎర్త్ లేనందున షాక్ తగిలి ఆవు మృతి చెందిందని స్థానికులు చెబుతున్నారు. వర్షం పడితే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి మంటలు వస్తుంటాయని వాపోయారు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం వల్ల పాడి ఆవు చనిపోయిందని, ఆ యజమానికి నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. ట్రాన్స్‌ఫార్మర్‌కు ఎర్త్‌పైపులను ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరా భూమిలోకి రాకుండా చేయాలని వారు కోరుతున్నారు.

బలిజ సంఘ భవనంలో శ్రీకృష్ణదేవరాయలు విగ్రహం


సమావేశంలో బలిజ భవన నిర్మాణ అభివృద్ధి కమిటీ నాయకులు

తిరుపతి అన్నమయ్యసర్కిల్: తిరుపతిలో నిర్మించనున్న బలిజ సంఘం భవన ఆవరణలో శ్రీకృష్ణదేవరాయలు విగ్రహం ఏర్పాటుకు ఆంధ్రప్రదేశ్ స్టేట్ కాపునాడు సేవా సమితి నిర్ణయం తీసుకుంది. సోమవారం స్థానిక చింతకాయల వీధిలో బలిజ భవన నిర్మాణ అభివృద్ధి కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా బలిజ సంఘ భవనం నిర్మించి తద్వారా బలిజల సంక్షేమంపై దృష్టి సారించడం, పేద బలజిలకు సాయం అందించడం వంటి అంశాలపై చర్చించి నిర్ణయం తీసుకున్నారు. సమావేశంలో ఆంధ్రప్రదేశ్ స్టేట్ కాపునాడు సేవాసమితి జిల్లా అధ్యక్షుడు మధురాయల్, యువ కాపునాడు అధ్యక్షుడు చిన్నారాయల్, కాపునాడు నగర అధ్యక్షుడు సతీష్ రాయల్, ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజురాయల్ తదితరులు పాల్గొన్నారు.

తహసున్నీసా బేగంకు కీలక పదవి



నియామకపత్రం అందుకుంటున్న తహసున్నీసా

తిరుపతితుడా/తిరుపతి అన్నమయ్యసర్కిల్: ఇంపాక్ట్ క్లబ్ ఇంటర్నేషనల్ రీజనల్ ప్రెసిడెంట్‌గా తిరుపతికి చెందిన తహసున్నీసా బేగం ఎంపికయ్యారు. ప్రస్తుతం ఆమె ఐసీఐ విస్డం క్లబ్ ప్రెసిడెంట్‌గా ఉన్నారు. హైదరాబాదులో ఆదివారం సాయంత్రం జరిగిన ఇంపాక్ట్ క్లబ్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ ఐకాన్ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ క్రమంలో తహసున్నీసా బేగం చేస్తున్న సామాజిక సేవ కార్యక్రమాలు, ఆమె నాయకత్వ లక్షణాలే పదవిని వరింపజేశాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంపాక్ట్ సర్టిఫైడ్ ట్రైనర్‌గా తాను సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. తనపై నమ్మకం ఉంచి అప్పగించిన రీజనల్ ప్రెసిడెంట్ పదవికి పూర్తిస్థాయిలో న్యాయం చేస్తామన్నారు. ఈ సందర్భంగా ఇంపాక్ట్ వ్యవస్థాపకులు గంప నాగేశ్వరరావు, జాతీయ అధ్యక్షుడు శ్రీనివాస్ సోను, జాతీయ కార్యదర్శులకు ఆమె ధన్యవాదాలు తెలిపారు.

గరుడ.. కనిపించదా..



నిత్యం లక్షలాది మంది భక్తులు తిరుమలకు వెళ్లేందుకు అలిపిరికి చేరుకుంటారు. ఈ మార్గంలోనే శ్రీవారి వాహనం అయిన గరుడ విగ్రహం ఉంటుంది. అయితే కొద్దిరోజుల కిందట ఈ గరుడ విగ్రహానికి పూలమాలను వేశారు. అయితే ఆ పూలమాల పూర్తిగా ఎండిపోయింది. వీఐపీలు, టీటీడీ ఉన్నతాధికారులు, ఉద్యోగులు, భక్తులు ఎవరైనా కొండ ఎక్కాలన్నా.. దిగాలన్నా.. ముందు ఈ గరుడ విగ్రహాన్ని దాటుకునే వెళ్లారు. అలాంటప్పుడు ఈ దృశ్యాన్ని టీటీడీ అధికారులు గమనించకపోవడం గమనార్హం. ఇప్పటికైనా టీటీడీ అధికారులు గరుడ విగ్రహంలో ఎండిన మాలను తొలగించి మరో మాలను వేసి ఇకపై ఇలా జరగకుండా చూడాలని భక్తులు కోరుకుంటున్నారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి

ట్యాగింగ్ మేళా.. జనం విలవిలా..



ఉదయం నుంచే నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట వేచి ఉన్న లబ్ధిదారులు, (ఇన్‌సెట్) జెండా ఊపి లబ్ధిదారుల బస్సును సాగనంపుతున్న కమిషనర్ మౌర్య

- ఉదయం నుంచే నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద జనం బారులు
- నగర పాలక, సచివాలయ సిబ్బంది మధ్య సమన్వయ లోపం
- ఇబ్బంది పడిన నగర ప్రజలు

తిరుపతి తుడా: రాష్ట్రప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పేదలందరికీ ఇల్లు పథకంలో భాగంగా తిరుపతి నగర పరిధిలో ఇంటి పట్టాలు పొందిన లబ్ధిదారులకు జియో ట్యాగింగ్ చేపడుతున్నామని నగరపాలక సంస్థ కమిషనర్ మౌర్య తెలిపారు. జియో ట్యాగింగ్ వెళ్లే లబ్ధిదారుల వాహనాలను సోమవారం కమిషనర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో తిరుపతి నగరంలో ఇంటి పట్టాలు మంజూరు చేసిన లబ్ధిదారులకు చిందేపల్లి, ఎం.కొత్తపల్లి, కల్లూరు లేఅవుట్లలో నిర్మిస్తున్న ఇళ్లకు జియో ట్యాగింగ్ కార్యక్రమం చేపట్టినట్టు తెలిపారు. మొత్తం 19,086 మంది లబ్ధిదారులకు గాను దాదాపు 10,000 వేల మందికి జియో ట్యాగింగ్ పూర్తయిందని, మిగతా పెండింగ్ లబ్ధిదారులకు 19, 20, 21 తేదీల్లో మూడు రోజులపాటు 9086 మంది లబ్ధిదారులకు జియో ట్యాగింగ్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ చెప్పారు. ఈ మూడు రోజుల్లో ఎవరైనా వెళ్లకపోతే మిగతా రోజుల్లో లబ్ధిదారులు వారికి ఇచ్చిన ఇంటి పట్టా ఆధారంగా లేఅవుట్‌కు వెళ్లి లబ్ధిదారులు జియో ట్యాగింగ్ చేయించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, హౌసింగ్ డీఈఈలు మోహనరావు, శ్రీనివాస్, కుమార్, హౌసింగ్ స్పెషలిస్ట్ డాక్టర్ కాటమరాజు, సెక్టోరల్ ఆఫీసర్లు, సచివాలయ కార్యదర్శులు, హౌసింగ్ అధికారులు పాల్గొన్నారు.

జియో ట్యాగింగ్ పరిశీలన

తిరుపతి నగర వాసులకు గత ప్రభుత్వ హయాంలో మంజూరు చేసిన ఇంటిపట్టాలకు సంబంధించి లబ్ధిదారులకు సోమవారం జియోట్యాగింగ్ ప్రక్రియను నిర్వహించారు. చిందేపల్లి, కల్లూరు, ఎం.కొత్తపల్లి ప్రాంతాల్లో కేటాయించిన లబ్ధిదారులను నగరపాలక సంస్థ అధికారులు ప్రత్యేక బస్సులను తీసుకెళ్లారు. ఇందులో భాగంగా చిందేపల్లిలో లబ్ధిదారుల జియో ట్యాగింగ్ ప్రక్రియను కమిషనర్ మౌర్య, నగరపాలక సంస్థ అధికారులతో కలిసి పరిశీలించారు.

పదిన్నర వరకు పడిగాపులు..

నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట లబ్ధిదారులు సోమవారం ఉదయం 7 గంటల నుంచి 10.30 వరకు జనం పడిగాపులు కాశారు. నగర పాలక సిబ్బంది, సచివాలయ సిబ్బంది సమన్వయలోపం స్పష్టంగా కనబడింది. ఉదయం 8 గంటలకే లబ్ధిదారులు నగరపాలకర సంస్థ కార్యాలయం ఎదుటకు చేరుకోవాలని సచివాలయ సిబ్బంది సూచించారు. దీంతో ఉదయం 7 గంటలకే లబ్ధిదారులు నగరపాలక సంస్థ కార్యాలయానికి చేరుకున్నారు. కనీసం ఉదయం టిఫిన్ చేయకుండా పరుగులు పెట్టారు. దీంతో షుగర్, బీపీ రోగులు, వృద్ధులు నరకయాతన పడ్డారు. అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

నోటీస్ బోర్డు

- భవానీ నగర్‌లోని రోటరీ క్లబ్ కార్యాలయంలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, తిరిగి సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు మెగా ఆక్యుప్రెజర్ వైద్యశిబిరం
- తాతయ్యగుంట గంగమ్మకు మరుపొంగళ్ల సమర్పణ సందర్భంగా తొలి మంగళవారం, ఉదయం 7 గంటలకు అమ్మవారికి అభిషేకం, ప్రత్యేక అలంకరణలో దర్శనమివ్వనున్న గంగమ్మ తల్లి
- మంగళం రోడ్డులోని ఆర్టీవో కార్యాలయం ఎదురుగా ఉన్న సహస్ర హాస్పిటల్లో ఉదయం 9 నుంచి రాత్రి 7 గంటల వరకు రక్తపోటు ఉచిత వైద్యశిబిరం
- బైరాగిపట్టెడలోని చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయంలో సాయంత్రం 5.45 గంటలకు సాహితీ వేత్త ప్రేమావతి, ప్రముఖ రచయిత గొల్లాపిన్ని సుబ్రమణ్యం సంస్మరణ సభ

16 మందికి జరిమానా

తిరుపతి లీగల్: మద్యం తాగి తిరుపతిలో వాహనాలు నడుపుతున్న 16 మందికి ఒక్కొక్కరికీ రూ.10 వేల చొప్పున జరిమానా విధిస్తూ తిరుపతి నాల్గవ అదనపు జూనియర్ సివిల్ జడ్జ్ గ్రంధి శ్రీనివాస్ సోమవారం తీర్పు చెప్పారు. ఈ మేరకు కోర్టు సూపరింటెండెంట్ సుబ్బారెడ్డి ఆ వివరాలను పేర్కొన్నారు. తిరుపతి అర్బన్ ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆదేశాల మేరకు తిరుపతి ట్రాఫిక్ పోలీసులు నగరంలో తనిఖీలు నిర్వహించారు. ఆ సమయంలో మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారిపై కేసులు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు ఆయన వివరించారు.

కూటమి అరాచకాలకు చరమగీతం పాడుదాం


కార్పొరేటర్ అనిల్‌కుమార్‌ను పరామర్శిస్తున్న భూమన అభినయ్‌రెడ్డి

తిరుపతి మంగళం : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కాలంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలను టార్గెట్ చేసుకుని కూటమి నాయకులు చేస్తున్న అరాచకాలు, రౌడీయిజాలకు త్వరలోనే చరమగీతం పాడుదామని వైఎస్సార్‌సీపీ తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి అన్నారు. టీడీపీ గూండాల దాడిలో తీవ్రంగా గాయపడిన తిరుపతి 50వ డివిజన్ కార్పొరేటర్ బోకం అనీల్‌కుమార్‌ను సోమవారం తిమ్మినాయుడుపాలెం హరిజనవాడలోని అతని నివాసం వద్దకు భూమన అభినయ్ రెడ్డి వెళ్లి పరామర్శించారు. దాడికి గల కారణాలు, దాడి చేసిన వారి పేర్లను అడిగి తెలుసుకున్నారు. అనంతరం దాడిలో గాయపడిన అనిల్‌తో పాటు అతని కుటుంబ సభ్యులను పరామర్శించి అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. కూటమి అరాచకాలను ప్రజలంతా గ్రహిస్తున్నారని, ప్రజలే వారికి బుద్ధి చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. ఇకపై కూటమి అరాచకాలు, దాడులను ఉద్యమాలతో తిప్పి కొడతామని హెచ్చరించారు. అనిల్‌ను పరామర్శించిన వారిలో 1వ డివిజన్ కార్పొరేటర్ ఆదం రాధాకృష్ణారెడ్డి, పార్టీ నాయకులు మద్దాలి శేఖర్, కుప్పయ్య, పసుపులేటి సురేష్, మల్లం రవి ఉన్నారు.

అర్హత కలిగిన అందరికీ ఉపాధి కల్పించాలి


మాట్లాడుతున్న తిరుమలై రామన్

తిరుపతి కల్చరల్: దేశంలో అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి ఉపాధి కల్పించాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) జాతీయ అధ్యక్షుడు రౌషన్ కుమార్ సిన్హా డిమాండ్ చేశారు. తిరుపతిలో నాలుగు రోజుల పాటు జరిగిన ఏఐవైఎఫ్ 17వ జాతీయ మహాసభల అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. దేశంలో యువత నిరుద్యోగ సమస్యను ఎదుర్కుంటోందన్నారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి ఉపాధి కల్పించడమే ప్రధాన డిమాండ్‌గా కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు ప్రత్యేక జాతా నిర్వహించనున్నట్లు తెలిపారు. దేశంలో ఎన్నికల సంస్కరణల అవసరాన్ని పేర్కొంటూ త్వరలో ఐదు కోట్ల మంది సంతకాలతో కేంద్రానికి వినతి పత్రం పంపిస్తామన్నారు. ఏఐవైఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి సుఖ్జీందర్ మహేశరి మాట్లాడుతూ అందరికీ ఉపాధి కల్పించేందుకు పోరాటం చేస్తామన్నారు.

జాతీయ నూతన కమిటీ ఎంపిక

ఏఐవైఎఫ్ నూతన కమిటీని ఎంపిక చేసినట్లు జాతీయ ప్రధాన కార్యదర్శి తిరుమలై రామన్ ప్రకటించారు. జాతీయ అధ్యక్షుడిగా రౌషన్ కుమార్ సిన్హా, ప్రధాన కార్యదర్శిగా సుఖ్జీందర్ మహేశరి ఎన్నికయ్యారు. ఏఐవైఎఫ్ జాతీయ మహాసభలు చివరి రోజు నూతన కమిటీని ఎన్నుకున్నట్టు రామన్ తెలిపారు.

కనుల పండువగా ఊంజల్‌సేవ


తిరుచ్చిపై భక్తులకు దర్శనమిస్తున్న స్వామి, అమ్మవార్లు


ఆలయ ఆవరణలో ఊంజల్‌సేవ నిర్వహిస్తున్న అర్చకులు

చంద్రగిరి: శ్రీనివాసమంగాపురంలోని శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో మూడు రోజుల పాటు జరిగిన వసంతోత్సవాలు సోమవారం ఘనంగా ముగిశాయి. ఇందులో భాగంగా ఉదయం సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపి తోమాలసేవ, కొలువు, పంచాంగ శ్రవణం, సహస్రనామార్చన నిర్వహించారు. ఉదయం 8.30 నుంచి 9 గంటల వరకు శ్రీదేవి భూదేవి సమేత శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారి ఉత్సవమూర్తులు, శ్రీసీతారామ లక్ష్మణ, ఆంజనేయ స్వామి, రుక్మిణి, సత్యభామ సమేత శ్రీకృష్ణుడి ఉత్సవమూర్తులను వసంత మండపంలోకి వేంచేపు చేసి ఆస్థానం నిర్వహించారు. అనంతరం మధ్యాహ్నం 1.45 నుంచి 3.30 గంటల వరకు ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం వైభవంగా జరిగింది. ఇందులో ముందుగా విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనం, రాజోపచారం నిర్వహించారు. సాయంత్రం 6 నుంచి 7 గంటల వరకు ఊంజల్ సేవ, రాత్రి 7 నుంచి 8 గంటల వరకు స్వామి, అమ్మవార్లు ఆలయ నాలుగు మాడవీధుల్లో విహరించి భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో ఆలయ స్పెషల్‌గ్రేడ్ డెప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఏఈఓ గోపినాథ్, సూపరింటెండెంట్ రమేష్ బాబు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు మునికుమార్, ధోనీ శేఖర్, భక్తులు పాల్గొన్నారు.

దళిత విద్యార్థిపై దాడి హేయనీయం


మాట్లాడుతున్న అంబేడ్కర్ భవన్ సభ్యులు

పాకాల : తిరుపతిలో బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతున్న దళిత విద్యార్థి జేమ్స్‌పై అగ్రకుల అహంకారులు యశ్వంత్‌నాయుడు, రూపీ, బ్లేడ్‌కిరణ్, ఎలైట్ పార్కు యజమాని పవన్‌తో కలసి హింసించి, దారుణంగా కొట్టి నోట్లో మూత్రం పోసి హత్యాయత్నం చేయడం హేయనీయమని అంబేడ్కర్ భవన్ అధ్యక్షుడు గుండ్లపల్లి ఆంజనేయులు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం ఆయన మండల కేంద్రంలోని అంబేడ్కర్ భవన్‌లో అధ్యక్షతన అత్యవసర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఇలాంటి వారిని కఠినంగా శిక్షించాలని కోరారు. అదేవిధంగా కేవీపీఎస్ నాయకుడు మధుసూదన్ రావు ఆధ్వర్యంలో పాకాల ఆర్టీసీ బస్టాండ్ ముందు దళిత విద్యార్థిపై దాడిని ఖండిస్తూ నిరసన తెలిపారు.

వెంటనే అరెస్ట్ చేయాలి..

దళిత విద్యార్థి జేమ్స్‌పై దాడి చేసిన వారిని వెంటనే అరెస్ట్ చెయ్యాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొత్తకోట రామమూర్తి డిమాండ్ చేశారు. మండలంలోని దామలచెరువులోని ఓ ప్రైవేట్ భవనంలో ఏర్పాటు చేసిన ఆ సంఘం సమావేశంలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పాల్గొన్నారు.

దళిత విద్యార్థిపై దాడి అమానుషం

తిరుపతి కల్చరల్: విద్యానికేతన్ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ చదువుతున్న దళిత విద్యార్థి జేమ్స్‌పై కుల దుహంకారంతో దాడి చేసి చంపేందుకు ప్రయత్నించిన వ్యక్తులను వెంటనే అరెస్ట్ చేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకటరత్నం సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కులం పేరుతో దూషిస్తూ అవహేళన చేసిన వారిని ప్రశ్నించడంతో జేమ్స్‌ను అంతమొందించేందుకు ప్రయత్నించడం దుర్మార్గపు చర్య అన్నారు. దళిత విద్యార్థిపై ఇంత దౌర్జన్యం జరిగినా తిరుచానూరు పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం విడ్డూరమని తెలిపారు. వెంటనే ఈ ఘటనపై స్పందించి దళిత విద్యార్థికి న్యాయం చేయాలని, లేదంటే ప్రజాసంఘాలు, దళితులు ఐక్య ఉద్యమాలు చేపట్టక తప్పదని హెచ్చరించారు.

ఆపరేషన్ సింధూర్‌తో సత్తా చాటిన భారత్

తిరుపతి క్రైమ్: ఆపరేషన్ సింధూర్‌తో ప్రపంచానికి భారత సత్తా తెలిసిందని త్రిపుర మాజీ ముఖ్యమంత్రి, ప్రస్తుత ఎంపీ బిప్లబ్ కుమార్ దేవ్ అన్నారు. ఆపరేషన్ సింధూర్ అవగాహన సదస్సు తిరుపతిలో బీజేపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి త్రిపుర మాజీ ముఖ్యమంత్రి, ప్రస్తుత ఎంపీ బిప్లబ్ కుమార్ దేవ్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మొదట ఆపరేషన్ల సింధూర్‌లో అమరుడైన సత్యసాయి జిల్లాకు చెందిన అగ్నివీర్ మురళీనాయక్‌కి నివాళులు అర్పించారు. ఆయన మాట్లాడుతూ.. ఆపరేషన్ సింధూర్ ద్వారా భారతదేశం సైనిక బలాన్ని కేవలం చైనా, పాకిస్తాన్‌కు మాత్రమే కాకుండా ప్రపంచానికి చూపించడం జరిగిందన్నారు. పెహల్గామ్‌లో జరిగిన దాడికి ప్రతీకారంగా భారత్ వాయుసేన 25 నిమిషాల్లో తీవ్రవాద స్థావరాలను చైనా రాడార్ వ్యవస్థకు అంతు చిక్కకుండా ధ్వంసం చేశామన్నారు. భారత వాయుసేన 25 నిమిషాల్లో పాకిస్తాన్ భూభాగంలో చొచ్చుకుపోయి మన మిసైల్స్ ద్వారా 9 పాకిస్తాన్ వైమానిక స్థావరాలను ధ్వంసం చేశామన్నారు. ఈ మొత్తం ఆపరేషన్ కేవలం 48 నిమిషాల్లో పూర్తి చేయడం జరిగిందన్నారు. ఇదే ఆపరేషన్ మరో గంట జరిగి ఉంటే పాకిస్తాన్ ప్రపంచపటంలో మాయమయ్యేదని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నారెడ్డి దయాకర్ రెడ్డి, ముని సుబ్రహ్మణ్యం, టీటీడీ బోర్డు మెంబర్ భానుప్రకాష్ రెడ్డి పాల్గొన్నారు.

పుచ్చలపల్లికి నివాళి


పుచ్చలపల్లి సుందరయ్యకు నివాళులు అర్పిస్తూ కాగడాల ప్రదర్శన చేస్తున్న సీపీఎం నేతలు

తిరుపతి కల్చరల్: స్వాతంత్ర్య సమరయోధుడు, దక్షిణ భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య 40వ వర్ధంతిని పురస్కరించుకుని సీపీఎం నగర కమిటీ ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం నగరంలో ఆయన చిత్రపటంతో పాటు కాగడాల ప్రదర్శన చేస్తూ ఘన నివాళులు అర్పించారు. సుందరయ్యనగర్, రైల్వేకాలనీ, యశోదనగర్ ప్రాంతాల్లో ఈ కాగడాల ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు మాట్లాడుతూ పుచ్చలపల్లి సుందరయ్య మరణించి 40 ఏళ్లు కావస్తున్నా చిరస్మరణీయంగా ప్రజల గుండెల్లో నిలిచిపోయారని కొనియాడారు. తన పేరులోని రెడ్డి పదాన్ని తొలగించి సుందరయ్యగా మార్చుకుని ఆదర్శప్రాయంగా నిలిచారన్నారు.

పుచ్చలపల్లికి నివాళి

పాకాల : మండల కేంద్రంలోని సీఐటీయూ కేంద్రంలో పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. సోమవారం సీఐటీయూ మండల అధ్యక్షుడు ప్రసాద్ అధ్యక్షతన సుందరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ముఖ్య అతిథిగా హాజరైన సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు మధుసూదన్‌రావు మాట్లాడుతూ పుచ్చలపల్లి సుందరయ్య జీవిత విశేషాలను వివరించారు. కార్యక్రమంలో కేవీపీఎస్ మండల కార్యదర్శి రవి, ఉపాధ్యక్షుడు డాక్టర్ సాంబశివ, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నేతలకు పరామర్శ


మునికృష్ణారెడ్డిని పరామర్శిస్తున్న చెవిరెడ్డి మోహిత్ రెడ్డి


ఎర్రమ రెడ్డి చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న హర్షిత్ రెడ్డి

తిరుపతి రూరల్, (రామచంద్రాపురం) : రామచంద్రాపురం మండలం సి.రామాపురం పంచాయతీకి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు మునికృష్ణారెడ్డి ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. మోకాలికి ఆపరేషన్ జరగడంతో ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ విషయం తెలిసి వైఎస్సార్ సీపీ జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి సోమవారం మునికృష్ణారెడ్డి ఇంటికి వెళ్లి పరామర్శించారు.

ఎర్రమరెడ్డి కుటుంబానికి పరామర్శ ..

చంద్రగిరి: స్థానిక పాతపేటకు చెందిన రాజులగారి ఎర్రమ రెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. సోమవారం పాతపేటలోని వారి స్వగృహంలో జరిగిన కర్మక్రియలకు వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి కర్మక్రియలకు హాజరై ఎర్రమ రెడ్డి చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఆయన వెంట పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళలకు ఎంసీపీ విధానంలో రుణాలు


తనపల్లిలో సాగు చేసిన లెమన్ గ్రాస్‌ను పరిశీలిస్తున్న డైరెక్టర్ శివశంకర్‌ప్రసాద్

తిరుపతి రూరల్ : మైక్రో క్రెడిట్ ప్లాన్ విధానంతో గ్రామీణ ప్రాంత మహిళలకు విరివిగా రుణాలు మంజూరు చేయడం జరుగుతుందని రాష్ట్ర గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఉన్నతి డైరెక్టర్ శివశంకర్ ప్రసాద్ తెలిపారు. తిరుపతి రూరల్ మండలం ముండ్లపూడి గ్రామ సమైక్యలో సోమవారం జరిగిన సమావేశానికి హాజరైన ఆయన మైక్రో క్రెడిట్ ప్లాన్, బిజినెస్ యాక్టివిటీ ఎంటర్‌ప్రెన్యూర్ వివరాలను తెలియజేస్తూ శ్రీ బాలాజీ సంఘం సభ్యులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. సంఘం సభ్యులకు వార్షిక క్రెడిట్, జీవనోపాధి ప్రణాళికపై అవగాహన కల్పించారు. సభ్యుల అవసరాల మేరకు ఏ నెలలో ఎంత రుణం కావాలి ? ఎన్యూమరేటర్ చేసిన డేటాకు యాప్‌లో ఉన్న రుణానికి గల వ్యత్యాసాన్ని పరిశీలించారు. అనంతరం వారు చేస్తున్న జీవనోపాధుల గురించి తెలుసుకోవడంతో పాటు వ్యవసాయ క్షేత్రంలో లెమన్ గ్రాస్ పెంచుతున్న విధానాన్ని పరిశీలించారు. అనంతరం పీడీ శోభన్ బాబు మాట్లాడుతూ సంవత్సరానికి సరిపడా రుణ ప్రణాళికలో ప్రతి మహిళా భాగస్వామ్యం వహించాలని తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా ఈ ప్రణాళికను పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా జీవనోపాధి డీపీఎం ధనంజయ రెడ్డి, బ్యాంకు లింకేజీ డీపీఎం ఆదినారాయణ, ఉన్నతి యాంకర్ పర్సన్ విజయ్ కుమార్, ఏపీఎంలు, సీసీలు, వీవోలు, వీఓఏలు, సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

కూటమి నేతల దళారీగా టౌన్‌ప్లానింగ్ అధికారి


నగరపాలక సంస్థ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న ఏఐటీయూసీ, సీపీఐ నాయకులు

తిరుపతి తుడా: వీధివిక్రయదారుల కడుపులు కొట్టి కూటమి నేతలు ఆర్థికంగా బలపడేందుకు సహకరిస్తూ దళారీగా వ్యవహరిస్తున్న టౌన్ ప్లానింగ్ అధికారిపై చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ నాయకులు డిమాండు చేశారు. ఈ మేరకు తిరుపతి నగరంలో వీధి విక్రయదారులపై టౌన్ ప్లానింగ్ అధికారి చేస్తున్న దౌర్జన్యాలు, షాపుల తొలగింపునకు వ్యతిరేకంగా ఏఐటీయూసీ, సీపీఐ వీధి విక్రయిదారుల కార్మిక ఫెడరేషన్ల ఆధ్వర్యంలో సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద ఏఐటీయూసీ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ధర్నా నిర్వహించారు. అనంతరం జిల్లా కార్యదర్శి రాధాకృష్ణ, సీపీఐ నగర కార్యదర్శి విశ్వనాథ్ మాట్లాడుతూ కార్పొరేషన్ పరిధిలో ఫుట్‌పాత్‌లను ఆక్రమించిన బడా హోటళ్ల నిర్వాహకులను ఏమీ చేయలేని టౌన్ ప్లానింగ్ అధికారి.. వీధి విక్రయదారులపైకి మాత్రం జేసీబీలతో, ట్రాక్టర్లతో మున్సిపల్ కార్మికులను తీసుకెళ్లి దౌర్జన్యాలు చేయించడం వస్తుందన్నారు. వీధివ్యాపారులకు ప్రత్యామ్నాయ స్థలాలు చూపాలని, లేదంటే ఊరుకోమని హెచ్చరించారు. అనంతరం వారు కమిషనర్‌ను కలిసిన టౌన్‌ప్లానింగ్ అధికారి చేస్తున్న అన్యాయాలను వివరించారు. అనంతరం టౌన్ ప్లానింగ్ అధికారిపై తీవ్రస్థాయిలో కమిషనర్ మండిపడ్డారు. సమస్యపై సానుకూలంగా స్పందించి, వారికి ప్రత్యామ్నాయ స్థలాలు చూపాలని తెలియజేశారు. ఏఐటీయూసీ, సీపీఐ నగర నాయకులు పాల్గొన్నారు.

బాలికల హాస్టల్‌లో సెల్‌ఫోన్లు చోరీ

తిరుపతి క్రైమ్: నగరంలోని అన్నమయ్య సర్కిల్లో నిర్వహిస్తున్న బాలికల హాస్టల్‌లో తొమ్మిది సెల్‌ఫోన్లు చోరీ జరిగిన సంఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. ఈస్ట్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. వైఎస్సార్ జిల్లాకు చెందిన ముద్దం గుణశేఖర్ బాలికల హాస్టల్ నిర్వహిస్తున్నారు. ఆదివారం ఓ గుర్తు తెలియని వ్యక్తి హాస్టల్‌లోకి చొరబడి 9 సెల్‌ఫోన్లను దొంగలించినట్లుగా ఫిర్యాదు చేశారన్నారు. ఆ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు చెప్పారు.

వర్షాలతో అప్రమత్తంగా ఉండాలి


చిరువ్యాపారుల వద్ద గేట్ పేరుతో నగదు వసూలు చేస్తున్నారని ఫిర్యాదు చేస్తున్న స్థానికుడు

తిరుపతి తుడా: వర్షాలు కురుస్తున్న తరుణంలో నగరంలో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని నగరపాలక సంస్థ కమిషనర్ మౌర్య అధికారులను ఆదేశించారు. సోమవారం ఆమె తన కార్యాలయంలో నిర్వహించిన డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు ఫోన్ ద్వారా 10 మంది సమస్యలు తెలుపగా, 32 మంది నేరుగా వచ్చి వినతులు అందజేశారు. ప్రధానంగా కూరగాయలు, పండ్లు, పూలు, కొబ్బరి బోండాలు విక్రయిస్తున్న తమ నుంచి మార్కెట్ ఫీజు పేరిట ఇష్టారాజ్యంగా గేట్ పేరుతో నగదు వసూలు చేస్తున్నారని ఫిర్యాదుదారుడు కమిషనర్‌కు మొర పెట్టుకున్నాడు. తక్షణం అర్జీలను పరిష్కరించాలని ఆమె అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ చరణ్‌తేజ్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మున్సిపల్ ఇంజినీర్ తులసి కుమార్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువఅన్వేష్, రెవెన్యూ అధికారులు, మేనేజర్ హసీమ్, ఏసీపీలు, సర్వేయర్ తదితరులు పాల్గొన్నారు.